వరంగల్-హనుమకొండ
బుధవారం 15 నవంబర్ 2023




ట్రాక్టర్‌లో కేసీఆర్ సభకు వస్తున్న ప్రజలు



తొర్రూరు, నవంబర్ 14 : మంత్రి దయాకర్‌రావుకు మద్దతుగా పాలకుర్తి నియోజకవర్గ ప్రజలు 'లక్ష'ణంగా తరలివచ్చి తొర్రూరు సభను విజయవంతం చేశారు. 'మా ఓట్లు మీకే'నంటూ సీఎం కేసీఆర్‌ను, మంత్రి దయాకర్‌రావును ఆశీర్వదించారు. తొర్రూరులో మంగళవారం నిర్వహించిన సభ గులాబీ వనాన్ని తలపించింది. పాలకుర్తి నియోజకవర్గ దారులన్నీ గులాబీమయమై బీఆర్‌ఎస్‌కు ఉన్న ఆదరణకు అద్దం పట్టాయి. సభకు అంచనాకు మించి ప్రజలు తరలిరావడంతో బీఆర్‌ఎస్ శ్రేణుల్లో జోష్ నెలకొంది. తొర్రూరు సభలో ప్రజలు కనిపించిన తీరును చూసి ముఖ్యమంత్రి కేసీఆర్ సైతం ముగ్ధులయ్యారు. తన ప్రసంగంలో కూడా 'నేను ముందే వచ్చిన.. జనం ఇంకా చేరుకోవాల్సి ఉందని దయాకర్‌రావు బాధపడ్డడు.. కని సభలో ఎంతమంది ఉన్నారో అంతకంటే ఎక్కువ మంది బయట రోడ్డు వెంట వస్తున్న తీరును హెలికాప్టర్ నుంచి చూసి సంబురపడ్డ. లక్ష మంది దాకా సభకు రావడం దయాకర్‌రావుపై అభిమానానికి నిదర్శనం' అని చెప్పడంతో ఒక్కసారిగా సభికులు కేరింతలు కొట్టారు. కేసీఆర్ ప్రసంగం ప్రారంభంలోనే యువకులు పెద్ద ఎత్తున ఈలలు వేస్తూ మద్దతు పలికారు. ప్రత్యేకించి అనేక మంది వృద్ధులు కాలినడకన తరలిరావడం కనిపించింది. పాలకుర్తి నియోజకవర్గాన్ని ముఖ్యమంత్రి కేసీఆర్ ఆశీర్వాదంతో ఎలా అభివృద్ధి చేశారో మంత్రి దయాకర్‌రావు తన ప్రసంగంలో వివరించిన తీరు, ఈ దఫా విజయం సాధించగానే ఏమేం పనులు చేయాలో సీఎం కేసీఆర్ ఎలాంటి మంజూరీలు ఇవ్వాలో అభ్యర్థించిన తీరు ఆకట్టుకున్నది.



సభలో ప్రసంగిస్తున్న సీఎం కేసీఆర్, పక్కన అభివాదం చేస్తున్న అభ్యర్థి ఎర్రబెల్లి, వేదికపై జనరల్ సెక్రటరీ కేశవరావు, మంత్రి సత్యవతి, సుధాకర్‌రావు, ఎమ్మెల్యే శంకర్‌నాయక్, ఎంపీ దయాకర్, మాజీ ఎంపీ రాపోలు

# అధినేతకు జన హారతి

- తొర్రూరులో పాలకుర్తి నియోజకవర్గ సభకు పోటెత్తిన గులాబీదండు
- మంత్రి దయాకర్‌రావు పిలుపుతో 'లక్ష'ణంగా తరలివచ్చిన సకల జనులు
- మద్దతుగా బారులు కట్టిన కుర్రకారు.. జాతరను తలపించిన సభా ప్రాంగణం
- సభ గ్రాండ్ సక్సెస్.. బీఆర్‌ఎస్ శ్రేణుల్లో నయా జోష్

## సీఎం కేసీఆర్‌కు పాలకుర్తి ప్రజల బ్రహ్మరథం


తొర్రూరులో సభకు భారీగా తరలివచ్చిన జనం, అభివాదం చేస్తున్న సీఎం కేసీఆర్



## దయాకర్‌రావును చెక్‌డ్యాంల రావు అంటం..

మంత్రి దయాకర్‌రావును చెక్‌డ్యాంల రావు అని అభివర్ణిస్తూ సీఎం కేసీఆర్ కితాబునివ్వడంతో సభలో నవ్వులు వెల్లివిరిశాయి. నియోజకవర్గ అభివృద్ధికి ఆయన పడుతున్న కష్టం మామూలుది కాదని, మూడుసార్లు వర్ధన్నపేట ఎమ్మెల్యేగా, మూడుసార్లు పాలకుర్తి ఎమ్మెల్యేగా వరుస విజయాలతో ఈ ప్రాంతాల అభివృద్ధికి పని చేస్తూనే అవకాశం దొరికినప్పుడల్లా ఆకేరు, పాలేరు, యశ్వంతాపూర్ వాగులపై చెక్‌డ్యాంలకు నిధులు మంజూరు చేయించుకుని 35 నుంచి 40 చోట్ల నిర్మాణాలు చేయించాడని గుర్తుచేశారు. 'మేమంతా ఆయనను దయాకర్‌రావు కాదు చెక్‌డ్యాంల రావు అని పేరు పెట్టుకున్నం' అని సీఎం చెప్పగానే సభలో నవ్వులు విరబూశాయి. 'ఆమెరికా నుంచి పాలకుర్తికి వచ్చి నాలుగు రోజుల మురిపెం చూపెట్టి టోపీపెట్టి పోయేటోళ్లను జనం పట్టించుకోవద్దు, కరోనా వంటి కష్టకాలంలో మీ వెంట ఉండి ధైర్యాన్నిచ్చిన దయాకర్‌రావును భారీ మెజార్టీతో గెలిపించాలె' అని ప్రజలకు ముఖ్యమంత్రి పిలుపునిచ్చారు. సభ ముగిసిన తర్వాత వేలాది మంది జన సందోహం నడుమ దయాకర్‌రావు తన వాహనం పైనుంచి అభివాదం చేస్తూ ముందుకు సాగారు. గంటకు పైగా సభా ప్రాంగణం నుంచి అంబేద్కర్ సెంటర్ వరకు వాహనాల ర్యాలీ కొనసాగగా దయాకర్‌రావు వాహనం ముందు యువకులు, గిరిజన మహిళలు, వివిధ గ్రామాల నుంచి వచ్చిన బీఆర్‌ఎస్ శ్రేణులు డ్యాన్సులు చేస్తూ 'దయాకర్‌రావు గెలుపు ఖాయం' అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు.


వేదికపై బిత్తిరి సత్తి ఆటాపాట



వేదికపై నాయకులతో కలిసి నృత్యం చేస్తున్న ఎర్రబెల్లి ఉషాదయాకర్‌రావు



'కేసీఆర్‌కే మన ఓటు' అంటూ నినదిస్తున్న బీఆర్‌ఎస్ అభిమాని


వివిధ వేషధారణల్లో కళాకారుల ప్రదర్శనలు


కాంగ్రెస్ కార్యకర్తలకు గులాబీ కండువా కప్పి బీఆర్‌ఎస్‌లోకి ఆహ్వానిస్తున్న సీఎం కేసీఆర్

## సభ హైలైట్స్

- తొర్రూరులో ప్రజా ఆశీర్వాద సభ జాతరను తలపించింది.
- సీఎం కేసీఆర్‌ను చూడాలన్న కుతూహలంతో పిల్లలు మొదలు ముసలివాళ్ల వరకు సభకు రావడం కనిపించింది.
- పాలకుర్తి మండలకేంద్రం, బమ్మెరకు చెందిన బీఆర్‌ఎస్ నేత వెంకట్ సీఎం సభకు గులాబీ రంగు తలపాగాలతో తన అనుచరులను వెంట పెట్టుకొని స్పోర్ట్స్‌జీప్‌లో ర్యాలీగా రావడం ఆకట్టుకుంది.
- సభలో చిందు యక్షగాన కళాకారులు, సూర్యాపేట జిల్లా తుంగతుర్తి నియోజకవర్గానికి చెందిన సురేశ్‌యాదవ్ అనే వీరాభిమాని ఒంటిపై 'జై కేసీఆర్, జై దయన్న' పేర్లతో పాటు నినాదాలు, చిత్రాలను వేసుకొని రావడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.
- సీఎం కేసీఆర్ తిరిగి వెళ్తున్న క్రమంలో వేదికపై రెండో వరుసలో కూర్చున్న తొర్రూరుకు చెందిన ఉద్యమకారుడు చామకూరి ఐలయ్యను గుర్తించి..'ఐలయ్యగారు బాగున్నారా'.. అని పలకరించిన తీరు కట్టిపడేసింది.
- షెడ్యూల్ ప్రకారం 1.50గంటలకు రావాల్సి ఉండగా 34 నిమిషాల ముందే కేసీఆర్ తొర్రూరు సభా ప్రాంగణానికి చేరుకొని అందర్నీ ఆశ్చర్యానికి గురిచేశారు.
- దేవరుప్పుల మండలానికి చెందిన కార్యకర్తలు ట్రాక్టర్లలో సభకు వస్తూ దారి మధ్యలో సద్దులు తింటూ సందడి చేశారు.
- సభకు వృద్ధులు ఒకరినొకరు దంటలుగా పట్టుకొని వచ్చిన తీరు కార్యకర్తలకు ఉత్సాహాన్నిచ్చింది..
- సభలో మిట్టపల్లి సురేందర్, బిత్తిరి సత్తి, గిద్దె రాంనర్సయ్య కళాబృందాల ఆటపాటలు కట్టిపడేశాయి.
- సభ ప్రశాంతంగా ముగియడంతో బీఆర్‌ఎస్ శ్రేణులు, పోలీసులు ఊపిరి పీల్చుకున్నారు.